# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 18-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 70 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## సరి-బేసి విధానం.. ఉల్లంఘిస్తే 4 వేలు జరిమానా

హైదరాబాద్, అక్టోబర్ 17: దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ సరి-బేసి విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. నవంబర్ 4 నుంచి 15వ తేదీ వరకు సరి-బేసి సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చే వాహనాలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని సీఎం కేజ్రీవాల్ తెలిపారు. నాన్ ట్రాన్స్‌పోర్ట్ ఫోర్‌వీలర్ వాహనాలకు సరి-బేసి విధానం అమలవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు సీఎం చెప్పారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సరి-బేసి విధానంలో వాహనాలు రోడ్డు ఎక్కాల్సి ఉంటుంది. ఆదివారాలు మినహాయింపు ఉంటుందన్నారు. సరి-బేసి విధానాన్ని ఉల్లంఘిస్తే 4వేల జరిమానా విధించనున్నారు.

# సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం
# 35మంది విదేశీ యాత్రికుల మృతి



### దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

దుబాయ్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళ్తున్న బస్సును ప్రొక్లెయినర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 35మంది మరణించారు. నలుగురు గాయపడ్డారు. సౌదీ అరేబియాలోని మదీనా నగరంలో ఈ ప్రమాదం జరిగింది. మదీనా నగరంలోని అల్ అఖల్ సెంటర్ దగ్గర బస్సు వస్తుండగా ప్రొక్లెయినర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురిని అల్ హమ్నా ఆసుపత్రికి తరలించారు. ఈ బస్సులో సౌదీ అరేబియాతోపాటు ఆసియా దేశాలకు చెందిన యాత్రికులు న్నారని మదీనా పోలీసులు తెలిపారు. గాయపడిన నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు చెప్పారు. పవిత్ర క్షేత్రం మక్కా సమీపంలో బుధవారం రాత్రి 7గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన బస్సులో ఏషియన్ అరబిక్ పౌరులు ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు.

మదీనా సమీపంలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో 35 మంది విదేశీయులు మృతి చెందిన ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మక్కా నుంచి మదీనా వెళ్లే హిజ్రా రోడ్డులో విదేశీయులతో వెళ్తున్న ఓ బస్సు మరో భారీ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాద ఘటనపై విచారణ కొనసాగుతున్నట్లు సౌదీ అధికారులు తెలిపారు.

# ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన నియోజకవర్గానికి చేసిందేమీ లేదు...

హైదరాబాద్, అక్టోబర్ 17:ఉప ఎన్నికల్లో భాగంగా హుజుర్ నగర్ లో ఈరోజు జరగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్న నేపథ్యంలో గిరిజన శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ నెరేడుచర్ల మండలంలోని రామకృష్ణ తండా, మూసి వడ్డు తండా, పులగం తండా, జగ్నా తండాలలో పర్యటించి వారికి మద్దతు పలికారు.

సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ నియోజక వర్గాన్ని రోల్ మోడల్ గా చేసేందుకు సీఎం కేసీఆర్ ఇచ్చే హామీల స్వయంగా వినేందుకు తండాలు తండోపతండాలుగా తరులుతున్న తీరును చూసి అభినందించారు.

తండాలలో కనీసం రోడ్డు వసతి లేక బైక్ మీద తండాలలో పర్యటించారు.

వచ్చే 100 రోజుల్లో ఈ రోడ్డును మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

కనీసం నలుగురు మనుషులు కూడా ఉండలేని గుడిసెలు చూసి బాధ పడ్డారు. గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఇంకా తండాలలో ఉండడంపై ధ్వజమెత్తారు.

తండాకు అవసరమైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేస్తానని, వెంటనే జాబితా రూపొందించాలని ఆదేశించారు.

చిన్న పిల్లలు తండాలలో బలహీనంగా ఉండడం చూసి ఆవేదన చెందారు. అంగన్వాడీ కేంద్రం కూడా అందుబాటులో లేదని , వెంటనే అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

మంత్రి హామీలతో తండవాసులు హర్షం వ్యక్తం చేశారు. వందకు వంద శాతం తమ ఓట్లు కారు గుర్తుకు వేసి ఈసారి తామేంటో నిరూపిస్తామని హామీ ఇచ్చారు.




హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం వివిధ తండాల్లో పర్యటించి ప్రజలను కలుసుకున్న మంత్రి సత్యవతి రాథోడ్

# మరోమారు ఢిల్లీలో సరిబేసి విధానం

### నిబంధనలు ఉల్లంఘిస్తే 4వేల జరిమానా

న్యూఢిల్లీ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ సరి-బేసి విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. నవంబర్ 4 నుంచి 15వ తేదీ వరకు సరి-బేసి సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చే వాహనాలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని సీఎం కేజ్రీవాల్ తెలిపారు. నాన్ ట్రాన్స్‌పోర్ట్ ఫోర్‌వీలర్ వాహనాలకు సరి-బేసి విధానం అమలవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు సీఎం చెప్పారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సరి-బేసి విధానంలో వాహనాలు రోడ్డు ఎక్కాల్సి ఉంటుంది. ఆదివారాలు మినహాయింపు ఉంటుందన్నారు. సరి-బేసి విధానాన్ని ఉల్లంఘిస్తే 4వేల జరిమానా విధించనున్నారు.

### చరిత్రలో నేటినిజం



తె॥ శ్రీ విశ్వనాథ సత్కవి
కావించిన రామకథను కల్ప కమును చున్
భావించి జ్ఞాన పీఠమే
దీవించి పురస్కరించె తెలుగులనెల్లన్!!

( అక్టోబర్ 18 శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి పుణ్యతిథి

-రాధశ్రీ
సెల్: 9494481210



# యువతి అనుమానాస్పద మృతి

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): నగరంలోని బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. గీతా(24) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. భర్త, అత్తమామల వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకిందపడి వ్యక్తి మృతి

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నాంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కదులుతున్న రైలును ఎక్కబోయిన యుపికి చెందిన మహేశ్ అనే వ్యక్తి మృతి చెందాడు. నాంపల్లి నుంచి విజయవాడకు వెళుతున్న గోదావరి ఎక్స్ ప్రెస్ బయల్దేరింది. ఈ క్రమంలో మహేశ్ రైలును ఎక్కబోయి కిందపడి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. శవ పరీక్ష కోసం మహేశ్ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ప్రగతిభవన్ ముట్టడికి.. విద్యార్థి సంఘాల యత్నం

### - అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్17 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా నిలిచిన విద్యార్థి సంఘాలు ప్రగతిభవన్ ముట్టడికి యత్నించాయి. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. గురువారం ఓయూ నుంచి విద్యార్థి నాయకులు ర్యాలీగా బయలుదేరారు. దీంతో అప్పటికే పహారాగా ఉన్న పోలీసులు ర్యాలీగా వస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకున్నారు. ఈ ర్యాలీలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్యూ, టీఎస్‌యూ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ర్యాలీగా వస్తున్న విద్యార్థులను ఎన్‌సీసీ గేట్ ఎదుట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని పోలీసులు అడ్డుకోవడాన్ని విద్యార్థులు ఖండించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లు తీర్చాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రగతిభవన్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు విద్యార్థుల ఐకాస ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు రవాణాశాఖ, ఆర్టీసీ అధికారులతో మంత్రి పువ్వాడ అజయ్ సమావేశం నిర్వహించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు.

## ఆయిల్ ట్యాంకర్ అగ్నికి ఆహుతి

### తీవ్రగాయాలైన డ్రైవర్ ఆస్పత్రికి తరలింపు

కోల్‌కతా,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ జల్‌పైగురి జిల్లాలోని బంధునగర్‌లో గురువారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి గురవడంతో.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. ప్రమాదస్థలికి చేరుకున్న నాలుగు ఫైరింజన్లు మంటలను అదుపు చేసేందుకు యత్నించా యి. క్షతగాత్రుడిని పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం సంభవించడంతో అక్కడ భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## జైలులో జర్నలిస్ట్ అనుమానాస్పద మృతి

బెంగళూరు,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): కర్ణాటకలోని సెంట్రల్ జైలులో జర్నలిస్టు ఆత్మహత్య చేసుకున్నాడు. వాయిస్ ఆఫ్ యలహంక దినపత్రికకు ఎడిటర్‌గా పని చేస్తున్న జర్నలిస్టు అనిరాజ్‌ను అత్యాచారం ఆరోపణల కింద పోలీసు లు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ జరుగుతుండగా.. జర్నలిస్టు జైలులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకు కేటాయించిన గదిలో అనిరాజ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. అయితే అనిరాజ్ ఆత్మహత్య చేసుకోలేదని, పోలీసులే హత్య చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనిరాజ్ మృతిపై విచారణ జరిపించాలని ఆయన కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీసీ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరు

### ఇందిరాపార్క్ వద్ద లెఫ్ట్ నేతల సామూహిక దీక్ష
### లాభాలు వచ్చే రూట్లలో ప్రైవేటీకరణ తగదు
### సమ్మెకు మద్దతు ప్రకటించిన నాయీ బ్రాహ్మణ సంఘం

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని వామపక్ష నేతలు ప్రకటించారు. ఐకాస బంద్‌కు మద్దతుగా ఇందిరాపార్క్ వద్ద వామపక్షాలు సామూహిక నిరాహార దీక్షకు దిగాయి. ప్రజా సంఘాల నాయకులు, ఇతర నేతలు దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులకు నివాళులర్పించారు. సీపీఐ, సీపీఎంతోపాటు ప్రజా సంఘాల నేతలు ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. లాభాలు వచ్చే మార్గాల్లోనే ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయని, నష్టాలు వచ్చే రూట్లలో ఆర్టీసీ బస్సులు తిప్పుతున్నారని ఆరోపించారు. ఈ దీక్షలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యాదర్శి చాడ వెంకటరెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఆర్టీసీకి పట్టణ రవాణాలోనే ఏటా రూ. 720 కోట్ల నష్టం వస్తోంది. 3 వేల అద్దె బస్సులు పెంచితే ఆర్టీసీ నిండా మునుగుతుందని అన్నారు. లాభాలు వచ్చే మార్గాల్లోనే ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. నష్టాలు వచ్చే రూట్లలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారని ఆరోపించారు. ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. 13 రోజులుగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రభుత్వం పంతానికి పోకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించి ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ముందుకు రావాలని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది మద్దికుంట లింగం అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు గత నెల జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిచేసిన కాలానికి వేతనాలు చెల్లించకపోవడం దారుణమని దుయ్యబట్టారు. ఆర్టీసీని రక్షించేందుకు కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. సమ్మెతో సామాన్య ప్రజలు, పేదలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమ్మె పేరు చెప్పి ప్రైవేటు వాహనదారులు ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారని, విచ్చ లవిడిగా తిరుతున్న ప్రైవేటు వాహనాలపై అజమాయిషీ కరువైందన్నారు. ప్రైవేటు సిబ్బందితో ఆర్టీసీ బస్సులు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు చర్చలకు పిలిచి సమస్య పరిష్కరించాలన్నారు. విలేకరుల సమావేశంలో సీనియర్ నేత మహేష్‌చంద్ర, కారల్గానిస్ట్ నారూ, రమేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో కేసీఆర్ సభ రద్దు

### - భారీ వర్షం కారణంగా రద్దుచేసిన టీఆర్ఎస్
### - సభాప్రాంగణానికి హెలికాప్టర్ వెళ్లేందుకు అనుమతివ్వని ఏవియేషన్ శాఖ
### - వర్షం కారణంగానే సభ రద్దయిందన్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్17(ఆర్ఎన్ఎ) : ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో తలపెట్టిన భారీ బహిరంగ సభకు వరుణుడు అడ్డు తగిలాడు. హుజూర్‌నగర్‌లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో ఒక్కసారిగా సీఎం కేసీఆర్ సభ రద్దయింది. హుజూర్ నగర్ ఉప ఎన్నిక ప్రచారానికి సీఎం కేసీఆర్ వస్తుండటంతో అధికార టీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. పెద్ద ఎత్తున జనసమీకరణను చేపట్టింది. సభా ప్రాంగణానికి ఇప్పటికే పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు. అయితే, ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం విరుచుకుపడింది. గంటసేపటి నుంచి కుండపోతగా వర్షం కురుస్తుండటంతో సభాప్రాంగణం అస్తవ్యస్తంగా మారిపోయింది. సభా ప్రాంగణంలో నీళ్లు చేరి.. బురదమయంగా అయింది. దీంతో ప్రజలను, పార్టీ కార్యకర్తలను ఇబ్బందిపెడుతూ.. సభ నిర్వహించడం కుదరదని గ్రహించిన సీఎం కేసీఆర్ సభను రద్దు చేశారు. దీనికితోడు సభాప్రాంగణం వద్ద భారీ వర్షంకురియడంతో సభకు వెళ్లేందుకు సీఎం కేసీఆర్‌కు ఏవియేషన్ శాఖ అనుమతి ఇవ్వలేదు. వాన పడుతున్నందున హుజూర్‌నగర్ వెళ్లడం కష్టమని పైలట్లు సూచించిన మేరకు హెలికాప్టర్ పర్యటనను రద్దు చేసినట్లు ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి ప్రకటించారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకున్న సంగతి తెలిసిందే. ప్రచారానికి ఇంకా రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. ఇప్పటికే ఇక్కడ ప్రధాన పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ క్రమంలో హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ సభకు టీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్లాన్ చేసింది. వారం రోజులుగా ఈ సభపైనే టీఆర్ఎస్ నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం సభ ఏర్పాట్లను మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పార్టీ ముఖ్య నేతలు దగ్గరుండి పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తయి.. మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా హుజూర్‌నగర్ చేరుకుంటారనే తరుణంలో వరుణుడి రాకతో సభకు బ్రేక్ పడింది.

సభ రద్దుపై మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. సభకు భారీ సంఖ్యలో టీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారని అన్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో కేసీఆర్ సభకు వచ్చే పరిస్థితి లేకపోవటంతో సభను వాయిదా వేయటం జరిగిందన్నారు. కేసీఆర్ సభకు రాకపోయినా తన సందేశాన్ని ఏ విధంగా ప్రజలకు చేరవేయాలని, లేకుంటే చివరి రోజు రోడ్‌షోలో పాల్గొంటారా అనేది చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపు దాదాపు ఖాయమైందని, 30వేల మెజార్టీకి పైగా సైదారెడ్డి గెలుస్తాడని మంత్రి తెలిపారు.

## విదేశీ పర్యటన రద్దుచేసుకున్న.. జస్టిస్ రంజన్ గొగొయి!

### - అయోధ్య భూ వివాదం కేసు తీర్పు నేపథ్యంలో నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్17(ఆర్ఎన్ఎ) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి తన విదేశీ పర్యటనను రద్దు చేసుకున్నారు. యావత్ భారత ప్రజానీకం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అయోధ్య భూవివాదం కేసు తీర్పును సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచిన విషయం తెలిసిందే. రాజకీయపరంగా, ప్రజల మనోభావాల దృష్ట్యా ఇది అత్యంత సున్నితమైన అంశం కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ నెల 18న దుబాయ్, ఆ తర్వాత ఈజిప్ట్, బ్రెజిల్, అమెరికాలోని న్యూయార్క్‌లలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. ఆ తర్వాత అక్టోబర్ 31న భారత్‌కు తిరిగి రావాల్సి ఉంది. అయితే, ఈ కేసు అత్యంత కీలకమైనది కావడంతో ఆ సమయాన్ని ఈ కేసు కోసం వెచ్చించాలని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. నవంబర్ 17న తన పదవీ విరమణ నేపథ్యంలో అంతకుముందే ముందే ఈ చారిత్రక కేసులో తీర్పును వెలువరించాలనే ఉద్దేశంతో జస్టిస్ రంజన్ గొగొయి తన పర్యటనను రద్దు చేసుకున్నట్టు సమాచారం. ఈ కేసులో జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇప్పటికే 40 రోజుల పాటు వాదనల విన్న అనంతరం తీర్పును రిజర్వుచేసిన విషయం తెలిసిందే. అయోధ్య భూ వివాదం కేసులో అలహాబాద్ హైకోర్టు 2010లో వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన 14 అప్పీళ్లపై విచారణ చేపట్టింది. ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీ నుంచి కక్షిదారుల వాదనలను రోజువారీగా ఆలకించింది. వచ్చే నెల 17లోపే ఈ వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించే అవకాశం ఉంది.

## ఆర్టీసీ సమ్మెకు .. కేసీఆర్ మాత్రమే కారణం

### - కేసీఆర్ మెడలు వంచడం పెద్ద పనేంకాదు
### - 19న జరిగే బంద్‌కు అందరూ సహకరించాలి
### - తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం

సూర్యాపేట, అక్టోబర్17(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ సమ్మెకు సీఎం కేసీఆర్ మాత్రమే కారణమని, కేసీఆర్ మెడలు వంచి సమస్యలు పరిష్కారం చేసుకోవటం పెద్ద సమస్య కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం. గురువారం సూర్యాపేట జిల్లాలో ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం సీఎం రాష్ట్రాన్ని దివాళా తీయిసున్నారన్నారు. రాష్ట్రాన్ని ఇద్దరు, ముగ్గురు పారిశ్రామికవేత్తలకు దోచిపెడు తున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల్లో ఉందని పదే పదే చెబుతున్న సీఎం.. ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదాయం ఎందుకు పడిపోయిందో సమాధానం చెప్పాలని కోదండరాం డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమ్మె విజయవంతం కోసం తెలంగాణ సమాజం మొత్తం అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమవుతున్నారని, కేసీఆర్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సమాజం మొత్తం ఏకమవుతున్నదని చెప్పారు. ఆంధ్ర పాలకులను తరిమికొట్టిన మనకు కేసీఆర్ మెడలు వంచడం పెద్ద పనేం కాదన్నారు. 19 న జరిగే రాష్ట్ర బంద్‌కు అందరూ సహకరించి విజయవంతం కోదండరాం చెయ్యాలని పిలుపునిచ్చారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, అక్టోబర్ 17: మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి శ్రీనివాస్ గౌడ్ నేడు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న జంక్షన్ పనులను మంత్రి పరిశీలించారు. అదేవిధంగా రూ.5కే భోజనం కేంద్రం పనులు, కళాభారతి పనులను పరిశీలించారు. 30 రోజుల పట్టణ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పనుల్లో ఉపయోగించే జేసీబీలు, ట్రాక్టర్లలను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

# 'ప్రగతి'భ్రాంతి

నేటినిజం
శుక్రవారం 18-10-2019

'ప్రపంచీకరణ' వ్యవస్థ కల్పించిన, కల్పిస్తున్న 'ప్రగతి'భ్రాంతిని 'నిజమైన ప్రగతి'అని భ్రమపడుతున్నారు. 'ప్రపంచీకరణ'– గ్లోబలైజేషన్–ను ప్రపంచ దేశాలపైకి 'ఉసికొలిపిన' అమెరికా, ఐరోపా దేశాలు ఇప్పుడు 'ప్రపంచీకరణ' కబంధ బంధం నుంచి 'విముక్త'లు కావడానికి గింజుకొంటున్నాయి, ఎందుకంటె వాటి వ్యూహం బెడిసికొట్టడం ఇరవై ఆరేళ్ల 'ప్రపంచీకరణ' చరిత్ర. ప్రవర్ధమాన దేశాల ప్రజలను తాము, తమ దేశాల బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు– మల్టీ నేషనల్ కంపెనీస్– దోచుకోవాలన్నది అమెరికా, ఐరోపా ప్రభుత్వాల 'ప్రపంచీకరణ' వ్యూహం! ఇప్పుడు చైనా 'వాణిజ్య సంస్థలు' తమ దేశాలలోకి చొఱ బడి పోతుండడం అమెరికా, ఐరోపా దేశాల కు నచ్చని 'పరిణామం'. ఇదీ వారి వ్యూహం బెడిసికొట్టడం! ఇలా అంతర్జాతీయ గుణపాఠాలు వికృతంగా అవిష్కృతం అవుతున్నప్పటికీ మన దేశంలోని ప్రభుత్వాల రాజకీయ నిర్వాహకులు మాత్రం గ్రహించడానికి సిద్ధంగా లేరు.. వ్యవసాయ రంగంలో మొదలైన రైతుల ఆత్మహత్యలు 'ప్రపంచీకరణ' విష ప్రభావానికి ఒక ఉదాహరణ మాత్రమే! 'ఆత్మహత్యలు' ఇతర రంగాలను సైతం ఆవహించడం నడుస్తున్న చరిత్ర! ఆత్మహత్యలతో రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు, ఆత్మహత్యల వల్ల వ్యవసాయేతర రంగాలలోని కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాబోవు. అయినప్పటికీ కార్మికులు, ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇదీ 'ప్రపంచీకరణ' భూతం విస్తరింపచేసిన మాయాజాలం! తెలంగాణ రాష్ట్ర 'రోడ్డు రవాణా సంస్థ'– ఆర్‌టిసి–కి చెందిన ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకొనడానికి ఇదీ నేపథ్యం. విపత్తు విస్తరించిపోతుండడానికి 'ప్రభుత్వ పారిశ్రామిక రంగం' కారణం కాదు, 'ప్రభుత్వేతర రంగం' కారణం కాదు! విపత్తు విస్తరించిపోతుండడానికి కారణం 'ప్రపంచీకరణ'! సార్వభౌమ దేశాల రాజ్యాంగ అధికార పరిధి కుంచించుకొని పోతోంది. 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల' అక్రమ లాభార్జన వాంఛా పరిధి వికృతంగా విస్తరించిపోతోంది! తెలంగాణ 'ఆర్‌టిసి'ని ప్రభుత్వంలో విలీనం చేయాలా? ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తారా? ప్రభుత్వేతర రంగానికి 'ఆర్‌టిసి'ని అప్పగిస్తారా? అన్న ప్రశ్నలకు సమాధానం మొత్తం దేశాన్ని ' తరచి దోపిడీ చేస్తున్న వాణిజ్య ప్రపంచీకరణ ప్రమాదం'లో ఒక అంశం మాత్రమే!! 'ప్రపంచీకరణ' గుదిబండను మన దేశం వదిలించుకుంటుందా? అన్నది సమగ్ర సమాధానం రావలసిన ప్రశ్న! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాలి. రాజకీయ పక్షాల వారు, ఆర్థిక మేధావులు, ఉద్యమకారులు చెప్పాలి! 'ధ్యాస'లేని ప్రజలు దోపిడీకి గురవుతున్నారు! ఇది అన్ని రంగాలకు చెందిన వైరీత్యం..ఇవేవీ తెలియని ప్రయాణీకులు నిరంతరం 'బలిపశువులు'.. ఇది రవాణా రంగానికి చెందిన దౌర్భాగ్యం!!

### టీఆర్ఎస్ గెలిస్తేనే..

## హుజూర్‌నగర్‌లో అభివృద్ధి

- గత ఎన్నికల్లో ఉత్తమ్ అబద్ధాలతో గెలిచాడు
- పద్మావతిని ఓడించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలే బాటలు వేసుకోవాలి

**– విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే భాస్కర్‌రావు**

సూర్యాపేట, అక్టోబర్17(ఆర్ఎన్ఎ) : టీఆర్ఎస్ గెలిస్తేనే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని టీఆర్ఎస్ ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే భాస్కర్ రావులు అన్నారు. బుధవారం పాలకీడు మండలం రాఘవపురం, గుండ్లపహాడ్‌లో హుజూర్‌నగర్ టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపును కాంక్షిస్తూ వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. హుజుర్‌నగర్‌ను అభివృద్ధి చేసే యువనాయకుడు సైదిరెడ్డి మాత్రమే అని స్పష్టం చేశారు. ఉత్తమ్ గత ఎన్నికల్లో అనేక అబద్దాలు చెప్పి గెలిచాడని, ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్వార్థంతో ఈ ఎన్నికలు వచ్చాయన్నారు. హుజుర్‌నగర్ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు.

ఉత్తమ్‌ను ఓడించి బుద్ది చెప్పాలని, కృష్ణపట్టిలో పుట్టిన సైదిరెడ్డికి ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే నరేంద్ర, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డిలు నేరేడుచర్ల మండలం రామాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. హుజుర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్

విజయం ఖాయమైందన్నారు. మంచి మెజార్టీతో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుస్తున్నారని అన్నారు. హుజుర్‌నగర్ ఓటర్లంతా టీఆర్ఎస్ వైపే ఉన్నారని, ప్రజలు ఉత్తమ్ మాటలను నమ్మడం లేదన్నారు. ఉత్తమ్ చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని, ఉత్తమ్‌కి ఓటేస్తే ఉత్తగానే పోతాయని హుజుర్‌నగర్ ప్రజలు గ్రహించాలని కోరారు. టీఆర్ఎస్‌కు ఓటేస్తే అభివృద్ధికి వేసినట్లే అని చెప్పారు. హుజుర్‌నగర్ ప్రజల మద్దతు టీఆర్ఎస్‌కే ఉందని ఎమ్మెల్యే నరేందర్ తెలిపారు. ప్రజలు ముక్తకంఠంతో సైదిరెడ్డిని గెలిపిస్తామని అంటున్నారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు

**– బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్‌రావు**

మెదక్, అక్టోబర్17(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికుల సమ్మెకు అన్ని రాజకీయ, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు మద్దతునిస్తున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్‌రావు తెలిపారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికులంటే ఫామ్‌హౌస్ పాలెగాళ్లు అనుకుంటున్నాడని విమర్శించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని టీఆర్ఎస్‌కు ఓట్లేస్తే.. అన్ని వర్గాల ప్రజల సమస్యలను విస్మరించి రాజకీయాలకే కేసీఆర్ ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. కార్మికుల పీఎఫ్ డబ్బును వాడుకున్న వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మొండిగా ఉంటున్న కేసీఆర్‌కు హైకోర్టు వివిధ సందర్భాల్లో 40 సార్లు మొట్టికాయలు వేసిందని, అయినా బుద్ధి రావడం లేదని మండిపడ్డారు. కోర్టు తీర్పును సైతం పట్టించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణలో మరో సకలజనుల సమ్మెకు ప్రజలు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా రఘునందన్‌రావు పిలుపునిచ్చారు.

## తాత్కాలిక సిబ్బంది దోపిడీ

### –జిల్లాలో లెక్క చూపని ఆదాయం

ఆదిలాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ):ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆరు డిపోల పరిధిలో ఆరు వందల ఇరవై నాలుగు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులున్నాయి. సమ్మె కారణంగా ఎక్కడికక్కడ తాత్కాలిక డ్రైవర్ లు, కండెక్టర్ లను నియమించుకున్నారు. వీటికి అదనంగా ప్రైవేటు బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్, ఇతర వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. పండుగ ముగిసి ఎక్కడి వారు అక్కడకుచేరుకునే సమయం కావడంతో ప్రతి వాహనం కిక్కిరిసిపోతోంది. అన్ని రూట్ల లోనూ భారీగా కలెక్షన్ లు వచ్చాయి, ఒక్కో బస్ లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నారు. కొన్ని బస్సుల్లో డ్రైవర్ లు, కండెక్టర్ లు కలిసి కలెక్షన్స్ లో కొంత భాగాన్ని నొక్కేస్తున్నారు. ఇక డిపోకు చేరుకున్న బస్సుల లెక్కల్లోనూ పారదర్శకత లేకుండా పోతోంది,

ఇలాంటి సందర్భాల్లో లాభాల కంటే ప్రయాణికుల సౌకర్యమే తమకు ముఖ్యమని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పేరిట ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్చను చాలా మంది తాత్కాలిక కండక్టర్ లు, డ్రైవర్ లు సొమ్ము చేసుకుంటున్నారు. లెక్కాపత్రం లేకపోవటంతో సమ్మె కాలం దొచుకున్నోడికి దోచుకున్నంతగా మారుతోంది. నిర్ణీత ఛార్జీలు మాత్రమే వసూలు చేయాలని ఆదేశించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు, బస్సుల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేశారు. అయినా క్షేత్రస్థాయి పరిస్థితిలో ఎలాంటి మార్పు రావడం లేదు, పర్యవేక్షణ లేకపోవటంతో అధికారుల ఆదేశాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. అసిఫాబాద్ లో అధిక చార్జీల వసూలుపై అక్కడి ప్రయాణికులు ఏకంగా జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు. ఆయన కండెక్టర్ ను మందలించి డబ్బులను ప్రయాణికులకు తిరిగి ఇప్పించారు. అయినా కొన్ని ఏరియాల్లో కండెక్టర్ లు అధిక మొత్తంలో వసూలు చేస్తూనే వున్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ఇంజినీరింగ్ విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్‌లో ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బ్రిడ్జ్‌ల్యాబ్జ్ ప్రకటించింది. 150 సీట్ల కెపాసిటీ కలిగిన ఈ ల్యాబ్ ద్వారా ప్రతియేటా 1,500 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ ఫౌండర్ మనోజ్ బరోట్ తెలిపారు. ప్రతియేటా 15 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు చదువు పూర్తిచేసుకొని బయటకు వస్తే వీరిలో 4 వేల మందికి మాత్రమే నైపుణ్యం ఉంటున్నదని, ఈ లోటును పూడ్చడానికి ఈ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నాలుగు నెలలపాటు ఇవ్వనున్న ఈ శిక్షణకు ఎలాంటి రుసుంను వసూలు చేయడం లేదని, కార్పొరేట్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందం వారు భరించనున్నారు. ఇప్పటికే ముంబై, బెంగళూరులలో ఉన్న ల్యాబ్‌ల ద్వారా 800 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఉపాధి కల్పించడానికి హైదరాబాద్‌కు చెందిన మూడు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

# అంతులేని అయోధ్య వివాదం

హైదరాబాద్, అక్టోబర్ 17:అయోధ్యపై సుప్రీంలో తుది వాదనలు ముగిశాయి. ఇక తీర్పు వెలువడటమే తరువాయి! అయోధ్య రాముడి స్థలమా లేక విదేశీ దండయాత్రికుడైన బాబర్‌దా అన్నది తేలాల్సి ఉంది. అయోధ్య,కాశీ, మధురలపై భారతదేశంలో ఇప్పుడు ఓనర్‌షిప్ చర్చ సాగుతోంది. ఇంతకీ అయోధ్యలో రాముడు జన్మించాడా లేదా అన్నది తేలాల్సి ఉంది. రామాయణం ట్రాష్ అన్న వారికి సరే.. మరికోట్లాది మంది హిందువులు తమ అయోధ్య ఎక్కడన్నది వెతుక్కోవాలి. అలాగే కృష్ణ జన్మస్థలం కోసం కూడా వెతుక్కోవాలి.

అలాగే కాశీ విశ్వేరుడిని వదిలేద్దాం. ఈ దేశంలో దాడులకు దిగి ఆలయాలను విధ్వంసం చేసిన వారికి కొమ్ముకాస్తున్న వారు ఇంకా స్థలవివాదాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోవడం భారతీయుల దౌర్భాగ్యం కాక మరోటి కాదు. అయోధ్య అన్నది రెండు మూడెకరాల పంచాయితీగా చూపి వందల ఏళ్లుగా కోర్టుల్లో కేసులు నడపడం పాలకులు సిగ్గుమాలిన చర్యగా చూడాలి. అయోధ్య వివాదాన్ని స్థల వివాదంగా చూపి వందలకోట్లు ఖర్చు చేయడం ఎందుకు? ఎక్కడో చోట రామాలయం నిర్మించుకోవచ్చన్న దౌర్భాగ్యులు కూడా ఉన్నారు. దగుల్బాజీ రాజకీయాలు ఉన్నంత కాలం ఇలాంటి దౌర్భాగ్యులు పుట్టుకొసతారు. ఇకపోతే ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న అయోధ్య వివాదంలో వరుసగా 40 రోజుల పాటు కొనసాగిన వాదనలకు సుప్రీం కోర్టు ముగింపు పలికింది. చివరి రోజైన బుధవారం సర్వోన్నత న్యాయస్థానంలో అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సున్నీ వక్ఫ్‌బోర్డుతోపాటు ముస్లింల తరపున వాదనలు వినిపించిన సీనియర్ లాయర్ రాజీవ్ ధావన్ హల్‌చల్ సృష్టించారు. 'ఇదే రామ జన్మభూమి' అంటూ అఖిల భారత హిందూ మహాసభ తరఫు న్యాయవాది వికాస్ సింగ్ చూపించిన ఒక మ్యాప్‌ను ధావన్ కోర్టు హాలులో, ధర్మాసనం ముందే చించి ముక్కలు చేశారు. అంటే రాముడికి ఈ సమాజం ఏ పాటి విలువ ఇస్తుందో గమనించాలి. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉంటుందా అన్నది చూడాలి. సుప్రీంకోర్టు చరిత్రలో సుదీర్ఘకాలం వాదనలు సాగిన ఘట్టాల్లో ఇది మూడవదని అంటున్నారు. సరిగ్గా నెలరోజుల్లో, అంటే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నవంబరులో పదవీ విరమణ చేసేలోగా ప్రకటించబోయే తీర్పు ఏ విధంగా ఉంటుందో తెలియదు కానీ, ఈ నలభైరోజుల వాదోపవాదాలు దేశప్రజల్లో ఉత్కంఠ రేపాయి. ముఖ్యంగా, వాదనలకు గడువు పొడిగించడానికి నిరాకరిస్తూ, ప్రధాన న్యాయమూర్తి స్పష్టి ప్రకటించిన తుదిరోజు పరిణామాలు కేసు తీవ్రతకు అద్దం పడుతున్నాయి. మరోకవైపు సుషుప్తావస్థలో ఉన్నదనుకున్న మధ్యవర్తిత్వ బృందం చివరి ఘడియల్లో కేసును కీలకమలుపు తిప్పే ఒక పరిష్కార ప్రణాళికను కోర్టుకు సమర్పించింది. ఈ'మాజీ జడ్జి ఖలీఫుల్లా నేతృత్వంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీరవిశంకర్, సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచులతో కూడిన ముగ్గురు సభ్యుల మధ్యవర్తిత్వ బృందం అత్యంత సంక్లిష్టమైన ఈ వివాదంలో వివిధ పక్షాల మధ్య గడువులోగా రాజీ సాధించలేకపోయిన విషయం తెలిసిందే. కానీ, ఇప్పుడు ఈ బృందం సమర్పించిన నివేదిక ప్రకారం సున్నీవక్ఫ్‌బోర్డు వివాదాస్పద స్థలంపై తన హక్కు వదులు కోవడానికి సిద్ధపడుతున్నది. ఒకపక్క రాజీవ్ ధావన్ చివరి నిముషం వరకూ న్యాయస్థానంలో రాజీలేని పోరాటం చేస్తుంటే, మరొకపక్కన వక్ఫ్‌బోర్డు మధ్యవర్తిత్వ బృందం ద్వారా ఈ రాజీ ప్రతిపాదనలు చేయడం ఓ విచిత్రమైన పరిణామం. తన హక్కులు వదులుకుంటున్నందుకు ప్రతిగా వక్ఫ్‌బోర్డు పెట్టిన షరతుల్లో కొన్ని అభ్యంతరం లేనివే.

అయోధ్యలోనే వేరే చోట మసీదు నిర్మాణం జరగాలన్న వాదనకు ఇప్పటికే విస్తృతామోదం, స్థలానికి సంబంధించిన కొన్ని ప్రతిపాదనలు ఉన్న విషయం తెలిసిందే. భవిష్యత్తులో మిగిలిన మసీదుల జోలికి రాకూడదన్న వక్ఫ్‌బోర్డు డిమాండ్ ఉత్తరభారతంలోని పలుప్రాంతాల్లో తాము సాగించబోయే ఉద్యమాలకు అడ్డుపడుతుందన్న భయంతో ప్రధాన కక్షిదారు రామజన్మభూమి న్యాస్ ఈ షరతులను తిరస్కరించినట్టు చెబుతున్నారు. సాక్ష్యాలు, రుజువులు, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన నలభై రోజులు వాదోపవాదాలు విన్న న్యాయస్థానం చివరి దశలో ముందుకొచ్చిన ఈ సెటిల్మెంటును ఏమాత్రం లక్ష్యపెట్టకూడదన్న అభిప్రాయం బలంగానే వినిపిస్తున్నది. డిసెంబరు 6న అంటే బాబ్రీ కూల్చివేత నాడే రామమందిర నిర్మాణం అరంభమవుతుందని సాక్షీమహారాజ్ అంటున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అధికారుల సెలవులు రద్దుచేసి, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు పెంచి, నిషేధాజ్ఞలు సైతం జారీ చేసింది. తీర్పు విశ్వాసాలపై కాక, చారిత్రక వాస్తవాలపై నిలవాలన్న కోరిక అటుంచితే, అది వెలువడే వరకూ, ఆ తరువాతా కూడా దేశంలో వాతావరణం వేడిగానే ఉంటుందన్న మాట వాస్తవం. ఇది వాంఛనీయం కాదు. అయోధ్య భూమి కోసంపోరాడుతున్న వారు అయోధ్యపై హిందువుల మనోభావాలను గౌరవించి ఉంటే సమస్య ఇంతదాకా వచ్చేది కాదు. అయోధ్య అన్నది ఓ నమ్మకం. దీనిపై కోర్టుల్లో వివాదాలు సృష్టించడం సరికాదు. ప్రజల నమ్మకాలపై దాడులు కూడా మంచిది కాదు. అయోధ్యలో రామాలయం అన్నది భారతీయుల ఆకాంక్ష. కాబట్టి ఇలాంటి విషయాల్లో మెజార్టీ హిందువుల మనోభావాలను గౌరవించడం అన్నివర్గాల వారికి మంచిది.

# గృహనిర్మాణ పథకంలో లొసుగులు

### ఏటా వేలల్లో ఇళ్లునిర్మిస్తున్నా అందని ద్రాక్షగా పథకం

### ఇళ్ల నిర్మాణాల్లో కానరాని చిత్తశుద్ది

హైదరాబాద్/ అమరావతి,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): సంక్షేమ పథకాల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉండిపోతోంది. నిధులు ఖర్చవుతున్నా ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. పేదలను పైకి తీసుకుని వచ్చేందుకు చేపడుతున్న పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం లేదా అందులో లోపాలు లేదా, అవినీతి కారణంగా పథకాలు పొందిన లబ్దిదారులు పేదరికం నుంచి బయటపడ లేక పోతున్నారు. గృహనిర్మాణాన్ని తీసుకుంటే కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా లక్షల సంఖ్యలో ఇళ్లు నిర్మిస్తూనే ఉన్నాయి. అయినా మళ్లీ లక్షల సంఖ్యలో లబ్దిదారులు పుట్టుకుని వస్తున్నారు. ఇప్పటిదాకా కట్టించిన ఇళ్లు ఎక్కడ పోయాయన్నది అర్థం కాకుండా పోతున్నది. తెలంగాణలో డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల కోసం పెద్ద యజ్ఞమే జరుగుతోంది. అలాగే ఎపిలో కూడా చంద్రబాబు హయాంలో గృహనిర్మాణం కోసం భారీగా నిధులు వెచ్చించారు. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ హయాంలో లక్షల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించినా వాటి జాడలేకుండా పోయింది. అలాగే కేంద్రం కూడా పేదరిక నిర్మూలన పథకం కింద కడా ఇళ్లను కట్టించింది. అయినా సరిపోవడంలేదు. తాజాగా తెలంగాణలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పథకం దాదాపు అన్నినియోజకవర్గాల్లో శరవేగంగా సాగుతోంది. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు డబుల్ ఇళ్లకు తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లతోపాటు అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ నిర్మించని విధంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు స్థలం సేకరించి అర్హులందరికీ ఒకే ప్రదేశంలో ఒక్కో ఇంటికి 7నుంచి 8 లక్షలు ఖర్చు చేసి ఇల్లు నిర్మించటంతో ఆ ప్రదేశం పట్టణ ప్రాంతంగా సుందరంగా కనిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు గేటెడ్ కమ్యూనిటీ కాలనీలను తలపిస్తున్నాయి. డబుల్ బెడ్ రూమ్ గృహాలు పేదలకు వరంగా మారాయి. పేదలకు గూడు కలిపించాలనే ఉన్నత లక్ష్యంతో పలుగ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను శరవేగంగా ప్రారంభించారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో పేదలు కూడా గౌరవంగా జీవించటానికి ఇళ్లు నిర్మించాని, దీనితో సీఎం కేసీఆర్‌కు దేశమంతా కీర్తిప్రతిష్టలు రానున్నాయని అంటున్నారు. అయితే ఇలా లబ్దిదారులు ఇళ్లు పొందుతున్నా మళ్లీ పుట్టుకుని వస్తున్నారు. ఎపిలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం చేపట్టారు. సర్కారు లెక్కల ప్రకారం ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలోనే ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. వందల కోట్ల రూపాయలు దీని కోసం ఖర్చు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు జగన్ అధికారంలోకి వచ్చాక పథకం పేరు మార్చి మళ్లీ అమలు చేస్తున్నారు. అయినా నిలువ నీడలేని నిర్భాగ్యుల సంఖ్య పెరుగుతోందే గాని తగ్గడం లేదు. పథకం గొప్పగా ఉన్నా అమలులో చిత్తశుద్ది లోపించడం వల్లనే సంపూర్ణంగా లక్ష్యం సాధించక పోవడమే దీనికి కారణం. సమైక్య రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై తెలుగుదేశం పార్టీ ఈ ఆరోపణలే చేసింది. టిఆర్ఎస్ కూడా తెలంగాణలో దర్యాప్తు చేపట్టగా అనేక లొసుగులు బయటపడ్డాయి. అంటే గతంలో ఇళ్ల నిర్మాణం అంతా కాగితాల్లోనే సాగింది. ఎపిలో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి మారకపోగా మరింతగా వ్యవస్థీకృతమయ్యాయన్న విమర్శలు వస్తున్నాయి. టిడిపి కార్యకర్తలతో నిండిపోయిన జన్మభూమి కమిటీలే క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషించడం, ఆ పార్టీకి చెందిన వారికే మంజూరు చేయడం ఈ పరిస్థితికి కారణం. కాంగ్రెస్ హయంలో మంజూరైన ఇళ్లకు నిధులు విడుదల కాకపోవడాన్ని కూడా ఈ విధంగానే చూడాలి. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం జరిగినా జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో నివాస స్థలాల కోసం పేద ప్రజానీకం సంవత్సరాల తరబడి చేసుకున్న దరఖాస్తులు కుప్పలు, కుప్పలుగా పేరుకుపోతున్న తీరు చూస్తుంటే పథకం అములులో ఎక్కడో లోపం జరిగిందన్నది వాస్తవం. వీటికి పరిష్కారం చూపడం ద్వారా అపోహలు తొలగించాలి. సొంతింటి కోసం సామన్యులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించడానికి బదులుగా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాలకవర్గ పార్టీలు వెంపర్లాడటం వల్లనే పథకం నీరుగారుతోంది. రాష్ట్ర విభజన తరువాత ఎపిలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని వారి వివరాలు సేకరించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే చేసిన స్మార్ట్ పల్స్ సర్వే ప్రకారం రాష్ట్రంలో 20.60 లక్షల కుటుంబాలను ఇళ్ల నిర్మాణ పథకాలకు అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. ఆ తరువాత నిర్వహించిన సాధికార సర్వేలో కూడా మరోసారి ఇటువంటి వివరాలను సేకరించారు. ఒకటికి, రెండుసార్లు సర్వేలు చేసినా ఇళ్ల నిర్మాణంలో పురోగతి స్వల్పమే. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి ముందు చేపట్టి వివిధ కారణాలతో మధ్యలోనే ఆగిపోయిన ఇళ్లు 2.50 లక్షలు ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి అదనంగా ప్రతి ఇంటికి 25 వేల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలైన దాఖలాలు లేవు. ఇలా తెలంగాణ,ఎపిల్లో గృహనిర్మాణ పథకం గతంలో అభాసుపాలయ్యింది. వేలకోట్లు ఖర్చు చేస్తున్నా నిధులు ఎక్కడ పోతున్నాయో అర్థం కావడం లేదు. సమీక్షించుకుని ముందుకు సాగకుంటే సమస్యలు తప్పవని గుర్తించాలి.

# వరుసగా ఇక శుభముహూర్తాలు

### వేలాదిగా పెళ్లిళ్లు.. గృహప్రవేశాలు

### మార్కెట్లలో మొదలైన కొనుగోళ్ల సందడి

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): పండగలు శుభకార్యాలకు మళ్లీ మంచి ముహూర్తాలురావడంతో మార్కెట్లో సందడి మొదలయ్యింది. ఇప్పుడు గృహప్రవేశాలు, పెళ్లిళల్కు అనుకూలంగా ఉందని పొరోహితుఉల తెలిపారు. జనవరి వరకు ముహూర్తాలు ఉన్నాయి. ఈ రెండు నెలలోనే అధిక సంఖ్యలో శుభకార్యాలు జరగనున్నాయి. వివాహాలకు దివ్యమైన ముహూర్తాలు ఉండటంతో ఆ రోజుల్లో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో తెలుగురాష్ట్రాల్లో పెళ్లి సందడి నెలకొంది. కార్తీకం, మార్గశిరం రెండు మాసాలు విశిష్టమైనవి కావడంతో పెళ్లిళ్లతో పాటు పెళ్లి చూపుల తతంగం, శంకుస్థాపనలు, గృహప్రవేశాలు, ఇతర శుభ కార్యాలు జరగుతున్నాయి. ఈ శుభ ఘడియల్లో ప్రతి రోజు వేలసంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉన్నట్లు పురోహితులు పేర్కొంటున్నారు. వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, పెళ్లి చూపులు, తదితర శుభకార్యాలకు కావాల్సిన సరుకుల కోసం హడావిడి మొదలయ్యింది. దీంతో బంగారం, వస్త్రాలయాల్లో జోరుగా షివంగ్ సాగుతోంది. మరోవైపు పండగలతో పాటు పెళ్లిల్లు, గృహప్రవేశాలుకలసి రావడంతో పూలమార్కెట్లో పూల ధరలకు అమాంతంగా డిమాండ్ పెరిగింది. ఉన్న మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్లు చేసేందుకు నిర్ణయించుకోవడంతో అన్నిరంగాల్లో హడావిడి మొదలయ్యింది.ఈ మేరకు ఫంక్షన్ హాళ్లు పూర్తిగా బుక్ అయ్యాయి. నగరంతో పాటు, శివారు ప్రాంతాల్లో పెళ్లిళ్లకు సంబంధించిన హాళ్లు ఎక్కడా ఖాళీ లేవు. దీంతో చాలామంది హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. హోటళ్లలో ప్యాకేజీలు ఇవ్వడంతో కొంతం ఆర్థికంగా ఖర్చు తక్కువగానే ఉంటోంది. అలాగే ఆర్భాటాలకు అవకాశం లేకుండా ఉంది. దీనికి తోడు జీఎస్టీ వల్ల పెళ్లి ఖర్చు పెరిగినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. శుభకార్యాలకు ముహూర్తాల రావడంతో వ్యాపారులకు గిరాకీ పెరిగింది. బంగారం ధర అధికంగా ఉన్నప్పటికీ వివాహాలకు కావాల్సిన నగల కోసం బంగారం కొనుగోలు చేయడం తప్పడంలేదు. పెళ్లిళ్లకు వస్త్రాల అమ్మకాలు పెరిగాయి. వీటితో పాటు శుభకార్యాలకు అవసరం అయ్యే పూలదండలు, ఇతర సామగ్రికి రేట్లు పెరిగాయి. పెళ్లిళ్లకు హాజరయ్యే అతిథులకు అధికప్రాధాన్యం ఇస్తున్నారు. విందు భోజనాల కోసం నిర్వాహకులు అధికంగా వెచ్చిస్తున్నారు. దీంతో వంటలు చేసేవారికి ఈ సీజన్ సంపాదనలో కలిసివస్తోంది. కళ్యాణవేదికల ఏర్పాటు, భాజాభజంత్రీలు, బ్యాండ్ మేళం వారికి గిరాకీ బాగా ఉంటుంది. ఇటీవల కాలంలో వివాహం ముగిసిన వెంటనే వధూవరులను ఆశీర్వదించేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమయంతో అనేక వివాహాల్లో సంగీత లహరీలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో

ఫంక్షన్‌హాల్‌లో సంగీత సందడి నెలకొంటోంది. ముందస్తుగా కల్యాణ మండపాలు బుకింగ్..ఇటీవల గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు సైతం పట్టణాల్లోని కల్యాణ మండపాల్లో వివాహాలు జరిపేందుకు ఆసక్తి కనబరుస్తుండటంతో వాటికి గిరాకీ పెరిగింది. ముహూర్తం నిర్ణయించుకున్న వెంటనే తొలుత ఫంక్షన్‌హాల్‌ను బుక్ చేసుకుంటున్నారు. మండపంలో అయితే అన్ని వసతులు ఉండటంతో ఇబ్బందులు లేకుండా వివాహాలు చేయవచ్చని, కనువిందుగా స్థాయిని బట్టి అలంకరణ చేసుకునే అవకాశం ఉండటంతో అత్యధికులు ఫంక్షన్‌హాళ్లనే ఎంచుకుంటున్నారు.

## భర్త కళ్లముందే అత్యాచారం

### దయ్యాల పేరుతో మంత్రగాడి ఘాతుకం

### ఆలస్యంగా జరిగిన ఘటనపై పోలీస్ కేసు..ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్,అక్టోబర్17 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్ పాతబస్తీలో దారుణం జరిగింది. ఓ మంత్రగాడు వైద్యం పేరుతో మహిళను ఆమె భర్త కళ్ల ముందే అత్యచారం చేసాడు. ఈ ఘోర సంఘటన ఫలక్‌నుమా పోలీసు స్టేషన్ పరిధిలోని ఎర్రకుంట ప్రాంతంలోని సదత్ నగర్‌లో సంభవించింది. తన భార్యకు దెయ్యం పట్టిందని అనుమానించిన ఒక వ్యక్తి తన భార్యను మూసా బావజీర్ అనే మంత్రగాడి వద్దకు తీసుకెళ్లాడు. ఆ మంత్రగాడు ఆదేశించిన మేరకు ఆ భర్త తన భార్య దుస్తులను బలవంతంగా తొలగించాడు. ఆ తర్వాత ఆ భర్త సమక్షంలోనే మంత్రగాడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన 2018 డిసెంబర్ 24న జరిగింది. కాగా, ఆ భర్త మరోసారి తన భార్యను అదే మంత్రగాడి వద్దకు తీసుకెళ్లగా ఆ మంత్రగాడి మిత్రుడైన షేక్ మొహసిన్ ఆమెను వివస్త్రను చేయాలని భర్తను ఆదేశించాడు. దీంతో ఆమె తీవ్రంగా ప్రతిఘటించి అక్కడ నుంచి బయటపడింది. ఈ సంఘటన తర్వాత ఆమెను భర్త, ఆమె అత్తమామలు ఇంటి నుంచి గెంటివేశారు. దీంతో ఆమె తన పుట్టింటికి చేరుకుంది. జులై 18న ఓమన్ నుంచి ఆమె తండ్రి హైదరాబాద్ చేరుకోవడంతో తనపై జరిగిన అత్యాచారాన్ని ఆమె తన తండ్రికి తెలిపింది. వెంటనే ఆమె తండ్రి ఈ సంఘటనపై ఫలక్‌నుమా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## బీమా డబ్బుల కోసం దారుణం

### అన్నను చంపిన తమ్ముడు

జైపూర్‌అక్టోబర్17(ఆర్ఎన్ఎ): బీమా డబ్బుల కోసం ఓ తమ్ముడు.. తన అన్నను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన రాజస్థాన్ అజ్మీర్‌లోని జవాజా ఏరియాలో ఈనెల 13న చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. కరణ్ జీ అనే వ్యక్తికి దావు(30), వజీర్(28) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. దావుకు కొన్నేళ్ల క్రితం ఓ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా రెండు చేతులు పోయాయి. దీంతో అతను ఇంట్లోనే ఉంటున్నాడు. దావు మీద ఇన్సూరెన్స్ పాలసీ చేయించాడు తండ్రి. నామినీగా అతని తమ్ముడు వజీర్ పేరును చేర్చారు. అయితే ఇటీవలే వజీర్ తన కుటుంబం నుంచి విడిపోయి వేరుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. తనను నామినీగా తీసేసి.. మరొకరి పేరును చేర్చుతాడేమోనని ఆందోళనతో దావును వజీర్ బండరాయితో మోదీ హత్య చేశాడు. అనంతరం దావు ఉరేసుకున్నట్లు సృష్టించాడు. దావు అనుమానాస్పద మృతిపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. దావును తానే చంపినట్లుగా వజీర్ అంగీకరించాడు. బీమా డబ్బుల కోసమే అన్నను హత్య చేశానని పోలీసుల ఎదుట వజీర్ ఒప్పుకున్నాడు.

## ఆర్టీసీ సమ్మె ఏ మలుపు తిరగనుందో?

### –కేసీఆర్ నిర్ణయంతో సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మె చివరకు ఏ మలుపు తిరుగుతుందో అన్న ఉత్కంఠ కలుగుతోంది. ఎందుకంటే సిఎం కెసిఆర్ హైకోర్టు తీర్పునుకూడా పట్టించుకోకుండా కార్మికులతో చర్చలేవన్నారు. అలాగే వారు ఉద్యోగులే కాదంటున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందనే భావించాలి. ఆర్టీసీ సమ్మె కారణంగా 150 కోట్ల నష్టం వాటిల్లిందని సిఎం కెసిఆర్ చెప్పడమే గాకుండా ఇక చర్చలు నో అన్నారు. దీంతో ఇప్పుడు అందరి చూపు...ఇప్పుడు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వైపే ఉంది. ఆయన కరుణిస్తాడా లేకా కాటేస్తాడా అన్న చర్చ సాగుతోంది. దీనిప ఎంపిలు, ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా నోరు మెదపడం లేదు.

హోరాహోరీగా సాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో...గులాబీ దళపతి నిర్ణయం...ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరోవైపు జీతాలు చెల్లించాలని, ఉద్యోగ సంఘాలతో చర్చించాలని కూడా హైకోర్టు సూచించింది. అలాగే సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించలేదని కార్మికసంఘాలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభినందర్‌కుమార్ షావిలి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. వేతనాలు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించింది. వేతనాల విభాగంలో పనిచేసే కార్మికులు కూడా సమ్మెలో ఉండటంతో ఆలస్యమైందని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. వేతనాలను సోమవారం కల్లా చెల్లించి, తమకు వివరణ ఇవ్వాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను ఈ నెల 21కి వాయిదావేసింది. మరోవైపు కార్మికులు తమ ఆందోళన రూపం మార్చుతున్నారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ గురువారం సమావేశం కానుండగా మరోమారు దానిని వాయిదా వేసుకున్నారు. ఆర్టీసీ పరిధిలోని ప్రతి బస్సును నడుపాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను రోజూ ఆదేశిస్తున్నారు. అయితే ఎక్కడా కనీసం బస్సులు నడవడం లేదు. అలాగే తాత్కాలిక డ్రైవర్లు ప్రమాదాలతో బెంబేలెత్తి స్తున్నారు. బస్‌డిపోల్లో కండిషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులు, ఆర్టీసీ అద్దెబస్సులన్నీ నడిపించాలని, దీనికోసం తాత్కాలిక డ్రైవర్లను నియమించుకోవాలని నిర్ణయించినా ప్రమాదాలతో అధికారులు జంకుతున్నారు.

## ఇంటింటి ప్రచారంలో టీఆర్ఎస్ నేతలు

### మహిళలతో కలసి బతుకమ్మ ఆట

నల్లగొండ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): హుజుర్‌నగర్ ఉప ఎన్నికలో భాగంగా నేరేడుచర్ల మండలం రామాపురంలో ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. హుజుర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ విజయం ఖాయమైందని ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంచి మెజార్టీతో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఉత్తమ్ మాటలను నమ్మడం లేదనీ.. ఉత్తమ్ చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదనీ ఆయన అన్నారు. ఉత్తమ్‌కి ఓటేస్తే ఉత్తగానే పోతాయని హుజుర్‌నగర్ ప్రజలు గ్రహించాలని పేర్కొన్నారు. హుజుర్‌నగర్ ఓటర్లంతా టీఆర్ఎస్ వైపే ఉన్నారనీ.. టీఆర్ఎస్‌కు ఓటేస్తే అభివృద్ధికి వేసినట్లే అని చెప్పారు. ఇక హుజుర్‌నగర్ ప్రజల మద్దతు టీఆర్ఎస్‌కే ఉందన్నారు ఎమ్మెల్యే నరేందర్. ప్రజలు ముక్తకంఠంతో సైదిరెడ్డిని గెలిపిస్తామని అంటున్నారని చెప్పుకొచ్చారు

# ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలి

• సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయండి

• ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేయవద్దు

**– సివిల్ సప్లయ్ మంత్రి గంగుల కమలాకర్**

కరీంనగర్, అక్టోబర్17(నేటినిజం ప్రతినిధి) : తెలంగాణ లో పండిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని సీఎం




ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖరీఫ్ సాగుపై సమీక్షించిన మంత్రులు ఈటెల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్.

కేసీఆర్ సూచించారని సివిల్ సప్లై మినిస్టర్ గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ లో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈసమీక్షలో మరో మంత్రి ఈటల రాజేందర్‌తో పాటు, సివిల్ సప్లయ్ కమిషనర్ అకూన్ సబర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ధాన్యపు గింజ కొంటామని ప్రకటించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒకటేనన్నారు. ప్రతీ గ్రామం లో ఏ రైతు ఎంత పండించారు అనే వివరాలు అధికారులు తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా 50లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి అవుతుందనే అంచనాలు ఉన్నాయన్నారు. చెక్ పోస్టులు పెట్టి ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరిపంటపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామంలో సర్పంచ్ ల తో పాటు రైతు సమన్వయ సమితి సహకారాన్ని కూడా తీసుకుని ధాన్యం కొనుగోలు ప్రశాంతంగా చేయాలన్నారు. అనంతరం సివిల్ సప్లై కమిషనర్ ఆకూన్ సబర్వాల్ మాట్లాతూ.. ప్రణాళిక బద్ధంగా కొనుగోళ్లు చేస్తే రైతులకు ఇబ్బందులు కలగవని అన్నారు. జగిత్యాల 5లక్షల మెట్రిక్ టన్నులు, కరీంనగర్ 5 లక్షల మెట్రిక్ టన్నులు, పెద్దపల్లి 4 మెట్రిక్ టన్నులు, సిరిసిల్ల 2 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి ఉండే అవకాశం ఉందన్నారు. మొత్తం 16 లక్షలు మెట్రిక్ టన్నుల వరి దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో కంటే 6లక్షల మెట్రిక్ అదనంగా వరి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఉమ్మడి జిల్లాలో18 టన్నుల మెట్రిక్ టన్నుల కొసం ప్లానింగ్ చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం కొనుగోలు చేయవద్దని అకూన్ సబర్వాల్ సూచించారు.

## మద్యం విధివిధానాల్లో కఠిన నిబంధనలు

**మద్యం సిండికేట్లకు చెక్ పెట్టేలా చర్యలు**

హైదరాబాద్,అక్టోబర్17 (ఆర్ ఎన్ఎ): తెలంగాణలో మద్యం సిండికేట్లను నిలువరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇటీవలే ప్రభుత్వం నూతన మద్య విధానాన్ని ప్రకటించన మేరకు నవంబరు 1వ తేదీ నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. ఈ క్రమంలో నవంబరు 1 నుంచి మొదలయ్యే మద్యం షాపుల్లో క్రయ విక్రయాల కోసం కఠిన నిబంధనలను అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ నాలుగు మద్యం షాపుల టెండర్ల పక్రియలో సిండికేట్‌గా ఏర్పడేందుకు కొందరు దరఖాస్తుదారులను మరికొం దరు కాంట్రాక్టర్లు బెదిరింపులకు గురి చేస్తున్నట్టు ప్రభుత్వానికి సమాచారం అందింది. మద్యం సిండికేట్ల రూపంలో ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా , అక్రమ మార్గాల్లో మద్యం వ్యాపారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆబ్కారీ శాఖ రంగం సిద్ధం చేసింది. లైసెన్స్ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యాపారులపై తెలంగాణ ఎక్సైజ్ చట్టం సెక్షన్ 36బి,41ల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఆర్‌పి రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మద్యం వ్యాపారులను ప్రభుత్వం హెచ్చరించింది. మద్యాన్ని అధిక ధరలకు అమ్మినా, సిండికేట్‌గా ఏర్పడినా ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష, వెయ్యి జరిమానా విధిస్తారు. అంతేకాక ఎక్సైజ్‌శాఖ తరపున మరో రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు జరిమానా వేస్తారు.

## కేసీఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు

**మాజీ ఎంపి రేణుకాచౌదరి మండిపాటు**

ఖమ్మం,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మానవ హక్కుల్ని కాలరాస్తున్నారని కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ ఎంపీ రేణుకాచౌదరి ఆరోపించారు. ప్రజాస్వామ్యం మంటగలిపేలా సీఎం కేసీఆర్ చర్యలు ఉన్నాయని అన్నారు. ప్రశ్నించే వారిని అణిచివేస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దుతగా నిలిచారు. రాష్ట్రంలో మంత్రులు సైతం గొర్రెల్లా ఉన్నారని విమర్శించారు. తానా అంటే తందానా అంటూ గడపుతు న్నారని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కేసీఆర్ పట్టించు కోకుం డామొండిగా వ్యవహరిస్తున్నారంటూ రేణుకా చౌదరి విమర్శించారు. రవాణా వ్యవస్థ మొత్తం సర్వనాశనం చేశారని అన్నారు. ఇలాగేనా ప్రభుత్వం పనిచేసే తీరు అని అన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు కార్మికులతో చర్చించడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. కేసీఆర్ కుక్క చనిపోతే కేసుపెట్టారు. కానీ జనం చచ్చిపోతే మాట్లాడరా? అంటూ ప్రశ్నించారు. కష్టపడి నెత్తురు చుక్కలతో నిర్మించుకున్న ఆర్టీసీని మీ మనుషుల కోసం ధారాదత్తం చేస్తారా?అంటూ ఆవె ప్రశ్నించారు. కేసీఆర్‌కు భయపడేది లేదు. తాడోపేడో తేల్చుకుంటామని ఈసందర్భంగా రేణుకాచౌదరి స్పష్టం చేశారు.

# నేడు మద్యం దుకాణాలకు లక్కీ డ్రా

**విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారులు**

**నవంబర్ 1నుంచి రెండేళ్లపాటు కొత్త పాలసీ**

**దరఖాస్తులతో రూ.10కోట్ల 56 లక్షల ఆదాయం**

ఆదిలాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): మద్య దరఖాస్తులకు బుధవారం గడువు ముగిసిపోవడంతో ఈనెల 18న లక్కీ డ్రా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని జనార్దన్‌రెడ్డి గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు లక్కీ డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయించనున్నారు. ఈ మద్యం పాలసీ నవంబరు 1నుంచి నవంబరు 1, 2021 వరకు అమలులో ఉండనుంది. గతంలో ప్రతియేటా అక్టోబరులోనే కొత్త మద్యం పాలసీని అమలు చేసే అధికారులు ఈసారి మాత్రం నెల రోజులు ఆలస్యంగా పాలసీని అమలు చేస్తున్నారు. ఎలాంటి అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకోకుండా జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నారు. జిల్లాలో ఉన్న 31 మద్యం దుకాణాలకు మొత్తం 528 దరఖాస్తులు రాగా మొత్తం రూ.10కోట్ల 56లక్షల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి రవీందర్ రాజు తెలిపారు. గతంలో లక్ష రూపాయలు ఉన్న దరఖాస్తు ఫీజు ఈ సారి రూ.2లక్షలకు పెంచిన దం`ఖాస్తుల సంఖ్య పెరుగడం గమనార్హం. లిక్కర్‌దందా లాభాలు కురిపించడంతోనే కొందరు వ్యాపారులు మహిళల పేరిట దం`ఖాస్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 20మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికా రులు పేర్కొంటున్నారు. దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయంతో పాటు పర్మిట్‌రూంల పేరిటా అదనపు ఆదాయంపై ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారు .పాత మద్యం పాలసీ గడువు ముగిసిపోవడంతో 2019-21 సంవత్సరానికి గాను కొత్త మద్యం పాలసీని అమలు చేసేందుకు అధికారులు ఈనెల 9నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ పక్రియ బుధవారంతో ముగిసింది. గతంలో జిల్లా వ్యాప్తంగా 28మద్యం దుకాణాలకు 500 దరఖాస్తులు రావడంతో రూ.5కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి మాత్రం జిల్లాకు మరో మూడు మద్యం దుకాణాలు మంజూరు కాగా మద్యం దుకాణాల సంఖ్య 31కి చేరింది. ఈ దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించగా 528దరఖాస్తులు వచ్చాయి .దీంతో రూ.10కోట్ల 56 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నారు. మద్యం పాలసీ గడువు సమయాన్ని రెండేళ్ల పాటు పొడగిస్తూ నిర్ణయం తీసుకుంది. నవంబర్ 1నుంచి కొత్త మద్యం పాలసీ ని అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో వరుసగా ఎన్నికలు రావడంతో లాభాలను కురిపించిన మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తులు చేశారు. ఇప్పటికే మద్యం వ్యాపారంలో మంచి అనుభవం ఉన్న వ్యాపారులు లిక్కర్ దందా చేజారీ పోకుండా బినామీ పేర్లతో దరఖాస్తులు చేయించినట్లు తెలుస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాల కంటే మున్సిపాలిటి పరిధిలో ఉన్న మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతా ల్లో అన్ని రకాల ఎన్నికలు ముగిసి పోవడంతో మరో ఐదేళ్ల వరకు ఎలాంటి ఎన్నికల హడావిడి లేకపోవడంతోనే గ్రామీ ణ ప్రాంతాల్లో దరఖాస్తుల సంఖ్య తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

# మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీకి దూరంగా టీఆర్ఎస్

**పోటీకి సిద్ధమని ప్రకటించినా కానరాని ఆసక్తి**

**సరిహద్దు జిల్లాల్లో ప్రభావం చూపనున్న ఉమ్మడి జిల్లా నేతలు**

ఆదిలాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేస్తామని గతంలో అధికారటిఆర్ఎస్ ప్రకటించినా ఎందుకనో మళ్లీ ఆసక్తి చూపలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాకర్షక పథకాల నేపథ్యంలో మహారాష్ట్రలో జరుగుతున్న ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ పక్షాన పోటీ చేసేందుకు ఆసక్తిని ప్రదర్శించారు. ఇటీవలనే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి బీ ఫాంల కోసం విజ్ఞప్తి చేశారు. ఒక దశలో కేసీఆర్ కూడా మహారాష్ట్రలో పోటీకి ఆసక్తిని ప్రదర్శించడంతో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఆఖరుక్షణంలో మహారాష్ట్రలో పోటీ చేసేందుకు టీఆర్ఎస్ విముఖత వ్యక్తం చేసింది. అయితే టీఆర్ఎస్ విధానాలకు అనుకూలంగా ఉన్న మహారాష్ట్ర రైతులు, ప్రజ లు ఈనెల 21న జరగనున్న ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు తెలుపుతారన్నది చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్రలో ప్రస్తుత అధికార పక్షమైన బీజేపీకి వ్యతిరేకంగా పోటీలోకి దిగుతామని సీఎం కేసీఆర్ గతంలో సూచించారు. తనను కలిసిన మహారాష్ట్ర నేతలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్‌సీపీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతున్నది. మొత్తం మీద మహారాష్ట్రలో జరుగుతున్న శాసన సభ ఎన్నికలపై పొరుగు తెలంగాణ జిల్లాలైనా నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. జిల్లా వాసులకు ఈ ప్రాంతంలో మహారాష్ట్రకు ఉన్న సన్నిహిత సంబంధాలే ఇందుకు కారణం. పొరుగున ఉన్న ధర్మాబాద్, నాందేడ్, కిన్వట్, రాజురా, చంద్రాపూర్, యావతమాల్ ప్రాంతాల్లో శాసనసభకు పోటీ పడుతున్న అభ్యర్థుల గెలుపోటములు, పార్టీల గెలుపోటములపై జిల్లా వాసుల్లో ఉత్కంఠ ఉంది. మహారాష్ట్రతో వివాహ సంబంధాలతో పాటు పాతకాలం నుంచి ఉన్న బంధుత్వాలు, వ్యాపార లావాదేవీలు ఎక్కువగా ఉన్న కారణంగా మరాఠా ఎన్నికల పై అందరిలోనూ ఆసక్తి రేకెత్తుతోంది. ఉమ్మడి జిల్లాల నుంచి మహారాష్ట్రలోకి ప్రవేశించే అంతరాష్ట్ర రహదారులు, చెక్‌పోస్టులపై మహారాష్ట్ర అధికారులు, పోలీసు యంత్రాంగం నిఘాను ఏర్పాటు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈప్రాంతం నుంచి మహారాష్ట్రకు డబ్బుల రవాణాపై నిఘా పెట్టడం కూడా చర్చనీయాంశమవుతోంది. బోరజ్, స్వర్ణ, బీద్రెల్లీ ప్రాంతాల్లో ఈ చెక్‌పోస్టుల్లో నిరంతర తనిఖీలు జరుగుతున్నాయి. రోవైపు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో మద్య నిషేధం అమలవుతున్న నేపథ్యంలో వాంకిడి చెక్‌పోస్టుతో పాటు సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూర్ మీదుగా వెళ్లే రహదారిపై మద్యం రవాణాపై కూడా మహ రాష్ట్ర పోలీసులు నిఘాను పెంచారు. ఈ నిఘాతో పాటు ఆయా చెక్‌పోస్టుల్లో పోలీసుల హడావిడి చర్చకు దారి తీస్తోంది. మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రచారానికి జిల్లా నేతలు క్యూ కడుతున్నారు. తమకున్న పరిచయాలు, పరపతిని ఉపయోగించుకొని వీరంతా సరిహద్దు మహారాష్ట్ర గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు పడకంటి రమాదేవి కూడా ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు.

# మరో సంచలన నిర్ణయానికి రెడీ అవుతున్న కిమ్

**గుర్రపుస్వారీ చేయడం సంకేతమంటున్న కొరియన్లు**

న్యూఢిల్లీ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): కొత్త ఆపరేషన్‌కు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ రెడీ అయినట్లు బుధవారం కొరియన్ వార్తాసంస్థ తెలిపింది. ఇందుకు ఆయన గుర్రుస్వారీ నిదర్శనమని పేర్కొంది. ఉత్తర కొరియా దేశంపై యుఎన్ నేతృతంలోని దేశాలు విధించిన ఆంక్షలపై ఆయన ఫైట్ చేయబోతున్నట్లు అర్థమవుతోంది. అణు చర్చలపై యుఎస్ మూమెంట్‌కి తనకు తానుగా విధించుకున్న స్వంత గడువు సమీపిస్తున్నందున కిమ్ ముఖ్యమైన నిర్ణయాలను ముందే ప్రకటించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కొరియాలోని అత్యంత ప్రమాదకర పర్వతమైన 'మౌంట్ పయేక్టు'లో కిమ్ సాహోసోపేతమైన గుర్రపుస్వారీ చేశారు. మంచుతో కప్పబడిన పయేక్టు ప్రాంతంలో కిమ్ తెల్లటి గుర్రంపై షికారు చేసిన ఫోటోలను కొరియా ప్రభుత్వం విడుదల చేసింది. కిమ్ వంశస్తులు ఈ పర్వతాన్ని ఎంతో ఆధ్యాత్మికమైన ప్రదేశంగా చూస్తారు. ప్రమాదకరమైన పర్వతంగా పేరు పొందిన పయేక్టులో కిమ్ ధైర్యంగా గుర్రపుస్వారీనీ ఆస్వాదించినట్లు ఆయన సహాయకులు తెలిపారు. ఏదైనా కీలక నిర్ణయాలు తీసుకునే ముందు కిమ్ ఇలాంటి సాహసయాత్రలు చేస్తారని తెలిపారు. 2013 చాలా పవర్ ఫుల్ వ్యక్తి అయిన తన మామను ఉరితీసేముందు, 2018లో సియోల్, వాషింగ్టన్‌లతో దౌత్యానికి సంబంధించినటువంటి ప్రధాన నిర్ణయాలు తీసుకునే ముందు కిమ్ దీనిని సందర్శించారు. 2018లో దక్షిణ కొరియాతో జరిగిన చారిత్రక శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు మూన్-జే-ఇన్‌ను పయేక్టు పర్వత శిఖరానికి తీసుకెళ్లారు. గతంలో అతిపెద్ద ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షించడానికి ముందు కిమ్ పయేక్టు పర్వతాన్ని సందర్శించారు. మరి ఈసారి కిమ్ దేనిపై ప్రకటన చేస్తారో అనేది తెలియాల్సి ఉంది. ప్రపంచ దేశాలు ఉత్తర కొరియాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ధైర్యంగా నిలబడాలనే ఉద్దేశంలో అధ్యక్షుడు కిమ్ ఇలాంటి సంకేతాలు ఇచ్చారని అర్థమవుతోంది. ఉత్తర కొరియా దేశంపై యుఎస్ నేతృతంలోని దేశాలు విధించిన ఆంక్షలపై ఆయన ఫైట్ చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# కేసీఆర్ మొండి వైఖరి వీడాలి

**ఆర్టీసీ సమ్మెపై అణచివేత ధోరణి సరికాదు**

**కార్మిక సంఘాలతో చర్చించాలి: కూనంనేని**

ఖమ్మం,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెపై సిఎం కెసిఆర్ వైఖరి సరికాదని, కార్మికుల పట్ల ఇరంకుశ వైఖరి విడనాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగ్గాణుద్యమంలో కీలక భూమిక పోషించిన కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తూ,సమ్మెను ఎగదోయడం వెనక ప్రైవేటీకరణ కుట్రలు సాగుతున్నాయని మండిపడ్డారు. కార్మిక సంఘాలతో తక్షణం జరపాలన్నారు. హైకోర్టు సూచనల మేరకు చర్చలు జరిపి సమ్మెను విరమించేలా చేయాలన్నారు. 19నజరిగే రాష్ట్ర బంద్ తర్వాత రాష్ట్రంలో సకలజనుల ఉద్యమం జరగబోతోందని, కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజాతిరుగుబాటు తప్పదన్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థి తులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర కార్మిక శాఖ ద్వారా కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, సమ్మెతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులాంటిదని, ఇప్పటికైనా కేసీఆర్ మనసు మార్చుకోవాలని కోరారు. టీఎన్‌జీవో నాయకులు కేసీఆర్ కాళ్లు పట్టుకుని అయినా సమ్మెపరిష్కారానికి కృషిచేస్తామని చెప్పడం ప్రజాస్వామ్యం కాదని, అది బానిసత్వానికి నిదర్శనమ న్నారు. పోరాడి సాధించుకోవాలి తప్పా ఎవరి కాళ్లు పట్టుకుని సమస్యల పరిష్కా రానికి బతిమిలాడాల్సిన అవసరంలేద న్నారు. టీఎన్‌జీవో నాయకులు ఇప్పటికైనా కలిసి పనిచేసేందుకు ముందుకు రావడం మంచి నిర్ణయమన్నారు. హుజూర్ నగర్‌లో సీపీఐ మద్దతు ఉపసంహరణతో టీఆర్ఎస్‌కు భయంపట్టుకుందని స్పష్టంచేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో మృతిచెందిన వారి కుటుం బాలకు ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషి యా, ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

## తుంగతుర్తి ఆలయంలో దొంగల దోపిడీ

**విగ్రహాలు, బంగారు ఆభరణాలు చోరీ**

నల్లగొండ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): తుంగతుర్తిలో సీతారాముడి ఆలయంలో దొంగలు భారీచోరీకి పాల్పడ్డారు. పంచలోహ విగ్రహాలతో పాటు వెండి, బంగారు ఆభరణాల అపహ రణ. రూ.15లక్షల విలువైన మొత్తం సొత్తు అపహరణ.అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి సీతా రాముల విగ్రహాలను వదిలేసి,కేవలం లక్ష్మణుడి పంచలోహ విగ్రహం,బంగారు,వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ,కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సీతాంామచంద్రస్వామి వారి ఆలయం పోలీస్ స్టేషన్‌కు అతి సమిపంలోనే ఉంటుంది. అయినా దుండగులు చాకచక్యంగా అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి,దేవాలయ ప్రధాన ద్వారం వద్ద గర్భగుడి తలుపులను పగులగొట్టి ,అతి పురాతన కాలం నాటి 25 కేజీల బరువుగల లక్ష్మణుడి పంచలోహ విగ్రహం,రెండు వెండి ధనుర్బానాలు, రెండు వెండి హస్తాలు, మూడు వెండి కిరీటాలు, వెండిప్లళెం,మరియు సీతా దేవి మెడలో ఉన్న 2.5గ్రాముల బంగారపు పుస్తె అపహరించుకెళ్లారు. ఈ ఆభరణాల విలువ సుమారు రూ.15లక్షలకు పైగానే ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. ంగళవారం ఉదయం పూజారి రామాచార్యులు రోజువారీలానే దేవాలయంలోకి దూప, దీప,నైవేద్యాలు చేయటానికి రాగా,అప్పటికే ఆలయ తలుపులు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు, సర్పంచ్‌కు సమాచారం ఇవ్వడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఆలయ పూజారి ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పూర్తిగా పరిశీలించారు

# ఉమ్మడి జిల్లాలో ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

**ఆందోళనలతో అట్టుడుకుతున్న కరీంనగర్**

**రేపటి బంద్‌కు సమాయత్తం అవుతున్న నేతలు**

కరీంనగర్,అక్టోబర్17(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ కరీంనగర్‌లో ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతంగా సాగుతోంది. డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాలోని కీరీంనగర్,సిరిసిల్ల, వేములవాడ ,పెద్దపల్లి,గోదావరిఖని డిపోల ముందు ఆందోళనలు కొనసా గిస్తున్నారు. బస్‌స్టేషన్ల వద్ద రిలే దీక్షలు చేపడుతున్నారు. మానవహారం, వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకో నిర్వహిస్తున్నారు. వివిధ రకాల ఆందోళనతో ఉధృతంగా సాగుతున్న సమ్మెను, ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని కార్మిక నేతలు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం తాత్కలిక కండక్టర్లు, డ్రైవర్లతో కొద్దిమేరకు బస్సులను నడుపుతోంది. తాత్కలిక కండక్టర్లు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తుండడంతో ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. ఉన్న తాధికారుల నుంచి వీఆర్వో, వీఆర్ఏ, పం చాయతీ కార్యదర్శుల వరకు తనిఖీలు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా కలెక్టర్ నోడల్ అధికారులను నియమించారు. తాత్కాలిక కండక్టర్ల అక్రమాలను నిరోధిస్తూ ఆర్టీసీ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టారు. సమ్మె విరమించాలని ప్రభుత్వం పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నా అదరకుండా, బెదరకుండా టీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ నెల 5నుంచి సమ్మె చేస్తున్నా సీఎం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభు త్వం స్పందించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. ఈ నెల 19న తెలంగాణ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అఖిలపక్ష నేతలు అన్నారు.ఈ నెల 19న తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కార్మికుల సమ్మెకు మద్దతుగా ఒక్క రోజు నిరాహారదీక్షను చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు రూ. 50వేల కోట్ల విలువ గల ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని, ఎంపీలు, మంత్రులకు ఇప్ప టికే రూ.76 కోట్ల విలువైన ఆస్తులను నామమాత్రపు రేట్లతో లీజుకు ఇచ్చారని ఆరోపించారు. కార్మికుల సమ్మెకు కారణాలు తెలపాలని కోర్టు జోక్యం చేసుకోవడం టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యోగాలు తీసేస్తామని చెప్పడంతో ఆర్టీసీ కార్మికులు మనోవేదనకు గురవుతున్నారని, ఆత్మబలిదానాలకు పాల్పడుతు న్నారని అన్నారు. కార్మికుల చావులకు సీఎం కేసీఆరే కారణమని వెంటనే సీఎంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# శివసేన నేత ఇంటిపై రాళ్ల దాడి

**– పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు**



ఔరంగాబాద్, అక్టోబర్17(ఆర్ఎన్ఎ) : శివసేన పార్టీ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ జాధవ్ ఇంటిపై బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు దాడి చేసి.. బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో కొందరు దుండగులు జాధవ్ ఇంటిపై రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో జాధవ్ ఇంటి కిటికీ అద్దాలు, కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇంటికి కాపలాగా ఉన్న వాచ్‌మెన్‌కు కూడా గాయాలయ్యాయి. దాడి సమయంలో జాధవ్ భార్య, వారి ఇద్దరు కొడుకులు ఇంట్లోనే ఉన్నారు. శివసేన పార్టీని వీడిన జాధవ్ తాజా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఔరంగాబాద్‌లోని కన్నడ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇటీవల ఓ ఎన్నికల సభలో శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేను ఉద్దేశించి కించపరిచే వ్యాఖ్యలు చేసినట్టు జాధవ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఠాక్రే పట్ల అభ్యంతర భాషను వాడుతూ ఆయన మాట్లాడినట్టు భావిస్తున్న ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే జాధవ్ ఇంటిపై దాడి జరిగింది. 'జై భవానీ, జై శివాజీ' అనే నినాదాలుచేస్తూ దుండగులు తమ ఇంటిపై దాడి చేశారని జాధవ్ భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. శివసేన సీనియర్ నాయకుడైన హర్షవర్ధన్ జాధవ్ పార్టీ అధినాయకత్వం తీరు నచ్చక ఇటీవల పార్టీని వీడారు. కాంగ్రెస్ మాజీ మంత్రి అబ్దుల్ సత్తార్‌ను ఠాక్రే శివసేనలోకి తీసుకోవడం జాధవ్‌కు నచ్చలేదు. సత్తార్ శివసేన అభ్యర్థిగా శిలోద్ నుంచి పోటీ చేస్తున్నారు.

# మహారాష్ట్రలోనూ మద్యం దుకాణాలపై భారీ ప్రచారం

**ఫలించని దేశీదారును అడ్డుకునే యత్నాలు**

**సిండికేట్‌గా మారిన దరఖాస్తుదారులు**

ఆదిలాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర సరిహద్దుల నుంచి చీప్ లిక్కర్ జిల్లాలో ప్రవేశించకుండా చేస్తున్న ఫలితాలు ఫలించడం లేదు. అక్కడి లిక్కర్ రాకుండా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలోను జిల్లా ఎక్సైజ్ అధికారులు కొత్త మద్యం పాలసీపై భారీగానే ప్రచారం చేశారు. సామాజిక మాధ్యమాలతో పాటు వార్తా పత్రికల్లో ప్రకటనలు వేయించి అక్కడి నుంచి కూడా దరఖాస్తులు వచ్చేలా ప్రయత్నించారు. అయినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని తెలుస్తుంది. సరిహద్దు ప్రాంతం నుంచి జిల్లాలోకి దేశీదారు మద్యం సరఫరాను అడ్డుకునేందుకే ఈ ఎత్తుగడలు వేసినట్లు చెబుతున్నారు. అలాగే అధిక ఆదాయమే లక్ష్యంగా అన్ని మార్గాల్లో ప్రయత్నించిన అధికారులు గతంలో కంటే ఈ సారి ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారా రెండింతల అధిక ఆదాయాన్ని సమకూర్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు.మద్యం వ్యాపారంలో అపార అనుభవం ఉన్న కొందరు బడా వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి లిక్కర్ దందాపై లుక్కేసారు. ముఖ్యంగా అత్యధికంగా అమ్మకాలు జరిగే దుకాణాల పై కన్నేసిన వ్యాపారులు సిండికేటుగా ఏర్పడినట్లు తెలుస్తుంది. ఐదు నుంచి 10 మంది వ్యాపారులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులను దాఖలు చేశారు. ఇందులో ఎవరికి దుకాణం దక్కినా అందరికి భాగస్వామ్యం ఉండేలా ముందే ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఎవరిని అదృష్టం వరిస్తుందో తెలియక పోవడంతో అందరితో దరఖాస్తులు వేయించి ఎవరికి మద్యం దుకాణం దక్కినా ఫర్వాలేదన్న ధోరణితో ఉన్నారు. ఒకవేళ ఆసక్తి లేని వారికి ఇచ్చే గుడ్‌విల్‌ను కూడా ముందే నిర్ణయించినట్లు చర్చజరుగుతుంది. దుకాణం డిమాండ్ బట్టి రూ.10లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఇచ్చేందుకు వెనుకాడడం లేదంటే లిక్కర్ దందాలో ఏ మేరకు లాభాలు ఉన్నాయో తెలుస్తూనే ఉంది.

### మత్స్యకారులకు అండగా ప్రభుత్వం: నిరంజన్ రెడ్డి

వనపర్తి,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): మిషన్ కాకతీయతో చెరువులను బాగు చేశామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేశామని వ్యవసాయ శాఖ మంత్రి సిగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని నల్లచెరువులో మంత్రి నిరంజన్ రెడ్డి చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వనపర్తి నల్లచెరువు మినీట్యాంక్‌బండ్‌గా రూపాంతరం చెందింది. మొదటిసారి కృష్ణానది నీళ్లతో అలుగు పారనుందన్నారు. కెసిఆర్ చెరువులను పట్టించుకోవడం వల్లనే చేపలు పెంచగలుగుతున్నారని అన్నారు. మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేశామన్నారు. నల్లచెరువు పునర్నిర్మాణంతో వనపర్తి మత్స్యకారులకు పూర్వవైభవం వస్తోంది.

## ప్రేమజంట ఆత్మహత్యాయత్నం.. ప్రేమికుడు మృతి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్17: తమ పెళ్లికి పెద్దలు అంగీకంచరేమోనన్న భయంతో ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకెళ్తే.. పినపాక మండలం, ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన చిన్నిస్వామి(22), ఓ యువతి గత కొన్ని నెలలుగా ప్రేమించుకుంటున్నారు. తమ ప్రేమను పెద్దలు అర్థం చేసుకోలేదు. చాలా సార్లు వారిని ఇరు కుటుంబాలు వారించగా.. వారు తమ పెళ్లిని కూడా ఖచ్చితంగా అడ్డుకుంటారని భావించిన ఆ ప్రేమజంట పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. విషయాన్ని గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. యువకుడు చిన్నిస్వామి అప్పటికే మంరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. అమ్మాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

# ఆ ఇద్దరి హయాంలోనే బ్యాంకులకు నష్టాలు

**మాజీప్రధాని మన్మోహన్,రఘురామరాజన్‌లపై నిర్మల మండిపాటు**

న్యూయార్క్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ఆ ఇద్దరి హయాంలోనే దేశీయ బ్యాంకింగ్ రంగ పరిస్థితి దిగజారిందని మాజీ ప్రధాని మన్మోహన్, మాజీ ఆర్బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్‌లపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. వాళ్లు సృష్టించిన సమస్యల్ని పరిష్కరిస్తూ.. బ్యాంకింగ్ వ్యవస్థకు జీవంపోసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అమెరికాలో ప్రఖ్యాత కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తూ మంగళవారం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే పగ్గాలు చేపట్టిన తొలి ఐదేళ్లలో ఆర్థికవృద్ధికి చేపట్టాల్సిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇటీవల రఘురామ్ చేసిన వ్యాఖ్యల్ని ఆమె ఖండించారు. రాజన్ హయాంలోనే విపరీతంగా రుణాలు మంజూరు చేశారన్నారు. కొంతమంది వ్యక్తుల ప్రోద్బలంతో కేవలం ఫోన్‌కాల్స్ ఆధారంగా అప్పులు ఇచ్చేశారని ఆరోపించారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయి.. నిధుల కోసం నేడు ప్రభుత్వం వైపు చూడాల్సిన దుస్థితి తలెత్తిందన్నారు. దేశంలో అధికారం కొంతమంది నాయకుల వద్దే కేంద్రీకృతమైందన్న రాజన్ వ్యాఖ్యల్ని కూడా ఆమె తప్పుబట్టారు. కాంగ్రెస్ సారథ్యంలోని యుపిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులలో రుణాల ఎగవేత తీవ్రస్థాయిలో ఉందని ఆమె విమర్శించారు. కొలంబియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ప్రసగింస్తూ ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రాఘురాం రాజన్ చెబుతున్న ప్రతి మాట ఆయనకే వర్తిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు.ప్రధానిగా మన్మోహన్ సింగ్, ఆర్‌బిఐ గవర్నర్‌గా రఘురాం రాజన్ ఉన్నపుడే ప్రభుత్వ రంగ బ్యాంకులు అత్యంత దుర్భరమైన దశను ఎదుర్కొన్నాయన్న వాస్తవాన్ని తాను ప్రజల ముందు ఉంచుతున్నానని నిర్మల అన్నారు.

